ఎంబీఏ ప్రవేశాలకు గడువు పొడగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 5: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ(ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు గడువును పొడిగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండు రంగారెడ్డి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే ఈ కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని, ఈ పరీక్షకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. తమ వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాలను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిగా నింపి, రూ.500 అపరాధ రుసుముతో సహా నియమిత రుసుమును ఈ నెల 14వ తేదీ వరకు చెల్లిస్తే దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. పరీక్షను ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. పై రెండు కోర్సులూ ఈవినింగ్ కోర్సులేనని చెప్పారు. ఈ కోర్సుల వ్యవధి రెండేళ్లుగా పేర్కొన్నారు. టీఎస్ ఐసెట్-2024లో అర్హత సాధించినవారు ఈ పరీక్ష రాయాల్సిన అవసరం లేదని, వారు దరఖాస్తు సమర్పించి, నేరుగా కౌన్సెలింగ్‌కు హాజరు కావొచ్చని వివరించారు. రెండు కోర్సులకు డిగ్రీ పూర్తి చేసి రెండేళ్లు ఎగ్జిక్యూటివ్ కేడర్‌లో విధులు నిర్వర్తించిన అనుభవం ఉండటం తప్పనిసరి. ఇతర వివరాలకు www.ouadmissions.com, www.osmania.ac.in వెబ్‌సైట్లలో చూసుకోవచ్చని సూచించారు.

సెటిల్మెంట్ చేసుకోకుంటే.. నల్లా కనెక్షన్ కట్!

- బకాయిదారులకు జలక్ ఇవ్వనున్న జల మండలి
- స్పెషల్ డ్రైవ్‌లో ఒత్తిడి పెంచాలని అధికారులకు అంతర్గత ఆదేశాలు
- ఈ నెలాఖరుకల్లా రూ.1000 కోట్లు రావాల్సిందే
- ఒక్కో అధికారి కనీసం రూ.20 కోట్లు వసూలు చేయాలని టార్గెట్లు
- పనితీరు బాగు లేకుంటే స్థానం చలనం గ్యారంటీ
- వన్ టైం సెటిల్‌మెంట్ పథకం సమీక్షలో జల మండలి ఈడీ హెచ్చరికలు

సిటీబ్యూరో, నవంబరు 5(నమస్తే తెలంగాణ): దీర్ఘకాలికంగా పేరుకుపోయిన నల్లా బిల్లులను వసూలు చేసేందుకు జల మండలి అందుబాటులోకి తెచ్చిన వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)పై జల మండలి స్వరం మార్చింది. ఇక రిక్వెస్టులు ఉండవు. బకాయిదారులపై ఒత్తిడి తీసుకొచ్చి వారి నుంచి బకాయిలు రాబట్టాలనే ఎత్తుగడలో భాగంగా.. సామ భేద దండోపాయాలు అన్న తరహాలో అధికారులు ట్రీట్‌మెంట్ చేయనున్నారు. బకాయిలు ఉన్న వారినే టార్గెట్‌గా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి, ఈ నెల 30వ తేదీలోగా ఓటీఎస్ సద్వినియోగం చేసుకోవాలని, లేదంటే సంబంధిత నల్లా కనెక్షన్‌ను తొలగిస్తామన్న హెచ్చరికలు జారీ చేయాలంటూ జల మండలి ఈడీ మయాంక్ మిట్టల్ మంగళవారం ఓటీఎస్‌పై జరిగిన సమావేశంలో డివిజన్, రెవెన్యూ అధికారులకు అంతర్గత ఆదేశాలు జారీ చేశారు. గతంలో కంటే ఈ సారి ఓటీఎస్ పని తీరు బాగు లేదని, అమలులో నిర్లక్ష్యం వహించొద్దని, ప్రజల్లో విస్తృత అవగాహన పెంచి బకాయిలు రాబట్టాలని అధికారుల పనితీరుపై ఈడీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓటీఎస్‌లో బాధ్యులైన ఒక్కో అధికారి కనీసం రూ.20 కోట్లు అయినా వసూళ్లు చేయాలని టార్గెట్ విధించారు. ఓటీఎస్ మీటింగులకు హాజరు కాకపోతే మెమోలు తప్పవని, ఇచ్చిన టార్గెట్‌లో పనితీరు బాగులేని అధికారికి స్థానం చలనం తప్పదని ఈడీ హెచ్చరించారు. బకాయిదారులందరినీ టచ్ చేయాలని, అవసరమైతే ఓటీఎస్ సద్వినియోగం చేసుకోకుంటే నల్లా కనెక్షన్ తొలగిస్తామని సంబంధిత బకాయిదారుడిపై ఒత్తిడి పెంచాలని ఆదేశించడం గమనార్హం. కాగా, ప్రభుత్వ శాఖల నుంచి రూ.1660 కోట్ల బకాయిల రాబడిలో ఆయా శాఖల ప్రధాన కార్యాలయాలకు లేఖలు రాయాలని నిర్ణయించిన అధికారులు, సాధారణ, మధ్య తరగతి ప్రజల బకాయి విషయంలో మాత్రం కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధం కావడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి.

మొదట్నుంచీ గందరగోళ మే..!

జల మండలి పరిధిలో 7,11030 మంది బకాయిదారులకు ఓటీఎస్ సద్వినియోగం కానుంది. వీరి నుంచి రూ.1792 కోట్లు జల మండలి ఓటీఎస్ రూపంలో ఆదాయం సమకూరగా.., రూ.1230 కోట్ల రిబేట్ ఉంటుంది. అయితే గత నెల 4న ఓటీఎస్‌కు ప్రభుత్వం అవకాశం ఇవ్వగా, జల మండలి సాంకేతిక కారణాలతో 17 రోజుల తర్వాత అందుబాటులోకి తీసుకువచ్చింది. దసరా, దీపావళి పండుగలు ఒకే నెలలో రావడం, ఓటీఎస్‌ను చివరి వారంలో అందుబాటులోకి తెచ్చి బకాయిలు చెల్లించాలని ఒత్తిళ్లు పెంచింది. ఈ నేపథ్యంలోనే తాజాగా లక్ష మంది కూడా ఇప్పటి వరకు ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోకపోవడంతో వచ్చే 25 రోజుల పాటు ఓటీఎస్ లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు టార్గెట్లు ఖరారు చేసింది. క్షేత్రస్థాయిలో బకాయిదారుల నుంచి ముక్కు పిండి వసూలు చేసేందుకు ప్రత్యేక బృందాలు, డిస్ కనెక్షన్ గ్యాంగులను సిద్ధం చేశారు. ఉచిత తాగునీటి పథకానికి దూరమై బకాయిలు పడిన బాధితులు ఒకవైపు, ఓటీఎస్ సద్వినియోగంలో ఆఫిడవిట్ అంటూ లబ్ధిదారులను అధికారులు భ్రయభ్రాంతులకు గురి చేస్తున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ సారి ఓటీఎస్ పథకం ప్రయోజనం పొందాలనుకునే వినియోగదారులు భవిష్యత్తులో 24 నెలల పాటు తప్పనిసరిగా బిల్లులు చెల్లిస్తామని ఆఫిడవిట్(హామీ) పత్రం ఇవ్వాలని నిబంధన విధించారు. ఆడిట్ అభ్యంతరంతో ఈ నిబంధనలు ఈ సారి తప్పనిసరి చేశారు. క్షేత్ర స్థాయిలో చాలా మంది ఆఫిడవిట్ ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వానికి చెప్పేందుకు బకాయిదారుల నుంచి ప్రత్యామ్నాయంగా సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలని తాజాగా నిర్ణయించారు.

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శ్రీనగర్ కాలనీలోని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ఇంటికి మంగళవారం వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. కాసేపు వారి కుటుంబ సభ్యులతో కలిసి ముచ్చటించారు.

చైల్డ్ ట్రాఫికింగ్ హాట్‌స్పాట్లు గుర్తించండి: డీజీ శిఖాగోయెల్

యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉమన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయెల్

హైదరాబాద్, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): పిల్లల అక్రమ రవాణాకు కేంద్రాలుగా ఉండే ఫ్యాక్టరీలు, దాబాలు, పరిశ్రమలు, హోటళ్లు, దుకాణాలు, గనులు, ఇటుక బట్టీలపై పోలీసులు, ఎన్జీవోలు, బాలల హక్కుల పరిరక్షణ సమితి పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయెల్ సూచించారు. పాన్ ఇండియా రెస్క్యూ అండ్ రిహాబిలిటేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్ అంశంపై మంగళవారం ఆమె కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. పిల్లల రెస్క్యూ, వారి పర్యవేక్షణ, చైల్డ్ ట్రాఫికింగ్ హాట్‌స్పాట్లు మరింత సులభతరం చేయడానికి ప్రత్యేకంగా ఓ పోర్టల్‌ను తీసుకొచ్చి సంబంధించిన డేటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రెమా రాజేశ్వరి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు బృందాధర్ రావు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సునంద, రాష్ట్ర న్యాయ సేవల అథారిటీ సభ్య కార్యదర్శి పంచాక్షరి, కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ సునీతా గోపాల్‌దాస్, పాఠశాలల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డికి రాసిన ఉత్తరాన్ని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

రిజిస్ట్రేషన్ల నిలిపివేత ప్రభుత్వ వైఫల్యం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 5: రిజిస్ట్రేషన్లను నిలిపివేయడం ప్రభుత్వ వైఫల్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మల్కాజిగిరి సర్కిల్‌లో 750 ఎకరాల విస్తీర్ణంలోని 70 కాలనీల రిజిస్ట్రేషన్లు నిలిపి వేయడంపై సీఎం రేవంత్ రెడ్డికి రాసిన ఉత్తరాన్ని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రిజిస్ట్రేషన్లను నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 1954లో వక్ఫ్ చట్టం వచ్చినప్పటి నుంచి ఎన్నిసార్లు సర్వేలు నిర్వహించారని అన్నారు. కబ్జా అవుతున్న సమయంలో వక్ఫ్ అధికారులు ఎన్నింటికి నోటీసులు జారీ చేశారో..? తెలుపాలన్నారు. ఇండ్లు, భవనాలు నిర్మించుకొని ఇంటి నంబర్లతో పాటు విద్యుత్, నల్లా, డైనేజీ సౌకర్యాలతో పాటు ప్రతి సంవత్సరం ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తున్నారని అన్నారు. వక్ఫ్ బోర్డు సీఈఓ 750 ఎకరాల విస్తీర్ణంలోని 70 కాలనీల ఇండ్లను యజమానులు అమ్ముకోవడాన్ని నిషేధిస్తూ, రిజిస్ట్రేషన్లను ప్రభుత్వం నిలిపివేయడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. వక్ఫ్ భూముల సంరక్షణకు వ్యతిరేకం కాదని, అయితే, అక్కడ ఎన్నో ఏండ్లుగా జీవిస్తున్న పేదలకు అన్యాయం జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

ప్రపంచ రికార్డుకు శ్రీచైతన్య పాఠశాలలు సన్నద్ధం

సిటీబ్యూరో, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): ప్రపంచ రికార్డును సృష్టించేందుకు శ్రీచైతన్య విద్యా సంస్థలు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూకే భాగస్వామ్యంతో విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రత్యేక ప్రతిభను వెలికితీయనుంది. ఈ క్రమంలో 10 వేల మంది విద్యార్థులతో 600 మ్యాథ్స్ ఫార్ములాలు ఏకకాలంలో పఠనం చేయనుంది. రియల్ టైం విశ్లేషణతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాలను బుధవారం సాయంత్రం 5.30 గంటలకు వెల్లడిస్తారని పేర్కొన్నారు. 2018లో 100 మంది విద్యార్థులతో 100 దేశాల మ్యాపుల పఠనం, 2022లో 601 మంది విద్యార్థులతో ఆవర్తన పట్టిక, 2023లో 2033 మందితో 100 నిమిషాల్లో 1 నుంచి 100 మ్యాథ్స్ టేబుల్స్ పఠనంతో మూడు ప్రపంచ రికార్డులను శ్రీచైతన్య విద్యా సంస్థలు క్రియేట్ చేసినట్లుగా తెలిసింది.

28,28,682 గృహాలపై సర్వే..!!

నేడు గ్రేటర్‌లో ఇంటింటి సర్వేను ప్రారంభించనున్న మంత్రి పొన్నం

సిటీబ్యూరో, నవంబరు 5(నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్‌లో బుధవారం ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సర్వేను లాంఛనంగా ప్రారంభిస్తారు. మేయర్ జీవీ లక్ష్మి, డిప్యూటీ మేయర్ ఎంఎస్ఎస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి ఈ సర్వేను ప్రారంభిస్తారని అధికారులు మంగళవారం పేర్కొన్నారు. 6వ తేదీ నుంచి ఈ నెల 30వ తేదీ వరకు జరిగే ఈ సర్వేలో సామాజిక ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ఇంటింటికీ ఎన్యూమరేటర్లు వెళ్లి సర్వే చేయనున్నారని తెలిపారు.

సర్వే విశేషాలు..

- సర్వేను గ్రేటర్‌తో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో నిర్వహిస్తారు. మొత్తం 28, 28, 682 గృహాలపై సర్వే ఉంటుంది. ఇందులో కంటోన్మెంట్ పరిధిలో 50 వేల గృహాలు ఉండగా, మిగతా 27,76,682 గృహాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నాయి. ప్రతి 150 ఇళ్లను ఒక బ్లాకుగా గుర్తించారు. సర్వే కోసం 19,328 ఎన్యూమరేటర్లను బ్లాకులుగా గుర్తించారు. 20% అదనంగా 23,194 ఎన్యూమరేటర్లను అందుబాటులో ఉంచారు.

శిక్షణ, పారితోషికం..

- మొత్తం 24,427 ఎన్యూమరేటర్లు శిక్షణ పూర్తి చేశారు. ప్రతి 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ సర్వే నిర్వహిస్తారు. 10 ఎన్యూమరేటర్లకు ఒక సూపర్‌వైజర్, కాగా, ఎన్యూమరేటర్లకు రూ.10 వేల పారితోషికం, సూపర్‌వైజర్లకు రూ.12 వేలు అందిస్తారు. డేటా ఎంట్రీ బాధ్యతలను డీసీల ఆధ్వర్యంలో సర్కిల్ స్థాయిలో నిర్వహిస్తారు.
- సూపర్‌వైజర్లు సర్వే ఫారాలను పూర్తిగా సేకరించడం, ఎన్యూమరేటర్లు తప్పు లేకుండా డేటా ఎంట్రీ బాధ్యతలు నిర్వహిస్తారు.
- 24,427 మంది ఎన్యూమరేటర్లలో 14,401 మంది స్వయం సహాయక సంఘం మహిళలు, 2877 జీహెచ్ఎంసీ సిబ్బంది, 3526 టీచర్లు, 4,387 ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీ కావాలి

ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సర్వేను ప్రారంభించిన ఆర్పీ పట్నాయక్

సిటీబ్యూరో, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సేవకులుగా పనిచేయాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సలహాదారులు, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ అన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ అధికారుల పనితీరు, రాజకీయ నాయకుల అవినీతిపై సర్వే కార్యక్రమాన్ని అమీర్‌పేటలోని తన కార్యాలయంలో ఆయన మంగళవారం ప్రారంభించారు. ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి నిస్వార్థంగా సేవ చేయాల్సిన ప్రభుత్వ అధికారులు కొంత మంది అవినీతికి పాల్పడుతూ సామాన్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏఏ ప్రభుత్వ శాఖల్లో ఎంత అవినీతి ఉంది? అధికారుల పనితీరు ఎలా ఉంది? అనే పలు అంశాలపై సర్వే జరుగుతుందన్నారు. సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నవంబర్ 5 నుంచి డిసెంబర్ 5 వరకు సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వేలో యువతను, రైతులను, మహిళలతో పాటు అన్ని వర్గాల ప్రజలను కలిసి వారి అభిప్రాయం సేకరిస్తున్నామన్నారు. సర్వే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు రకాలుగా చేస్తున్నామని, నెలరోజుల పాటు సర్వే చేసిన తర్వాత రిపోర్ట్‌ను సంస్థ ప్రధాన సలహాదారులు మాజీ సీబీఐ జేడీ లక్ష్మీనారాయణ విడుదల చేస్తారన్నారు.

పిల్లల దత్తతలు పెరగాలి: కలెక్టర్ అనుదీప్

సిటీబ్యూరో, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): అనాథ పిల్లలకు చైల్డ్‌కేర్ సంస్థలే తల్లిదండ్రులని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. అనాథ బాలలకు మంచి విద్య, భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా దత్తత కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించకుండా చైల్డ్ కేర్ సంస్థలు ఉండాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన ఐసీపీఎస్, చైల్డ్ కేర్ సంస్థలకు లైసెన్స్ రెన్యూవల్ జారీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ప్రతి శుక్రవారం పిల్లల దత్తత కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కాగా, 50 చైల్డ్ కేర్ సంస్థలు కలెక్టర్ లైసెన్స్‌లు అందించారు. ఈ సమావేశంలో డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ అక్వేశ్వర రావు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యానికి కేసీఆర్ పునాది

ఒక విజన్ ఉన్న నేత ఆసుపత్రుల అభివృద్ధికి నాడే.. పెద్ద పీట

జల్‌పల్లిలో 30 పడకల దవాఖానకు గతంలో రూ.10.70 కోట్లు మంజూరు

బస్తీ, అర్బన్ దవాఖానలతో పాటు కందుకూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు

ఆసుపత్రి స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

జల్‌పల్లిలో 30 పడకల ఆసుపత్రి కోసం స్థలం పరిశీలిస్తున్న మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 5: ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక విజన్‌తో దవాఖానలు, మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేయించారని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేయబోయే ఆసుపత్రి స్థలాన్ని మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆసుపత్రుల అభివృద్ధికి పెద్ద పీట వేశారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో ఉన్న జనాభాకు అనుగుణంగా 30 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడానికి గతంలోనే నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఎంతో మంది పేదలు ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నారని గ్రహించి కేసీఆర్ ప్రత్యేక నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గతంలో ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకపోవడంతో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు రూ.10.70 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆసుపత్రి కోసం ఐదెకరాల స్థలం కావాలని గతంలో వక్ఫ్ బోర్డుకు లేఖ రాయడం జరిగిందన్నారు. అందుకు వక్ఫ్ బోర్డు వారు సానుకూలంగా స్పందించారన్నారు. కేసీఆర్ హయాంలోనే మహేశ్వరం నియోజక వర్గంలోని కందుకూరులో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. కళాశాలతో పాటు 400 ల పడకల ఆసుపత్రి నిర్మాణం చేయడానికి నిధులు కేటాయించి శంకుస్థాపన చేశామన్నారు. 10 బస్తీ దవాఖానలు, నాలుగు అర్బన్ బస్తీ దవాఖానలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు తావు లేకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు చేశామన్నారు. విద్య వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ఐమత్ సాదీ, కమిషనర్ వెంకట్రామ్, సూరెడ్డి కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారి అమోయ్‌పై కక్ష ఎందుకు?

- బీసీగా పుట్టడమే ఆయనకు శాపమా? మద్దతుగా బీసీల పోరు
- బీసీ నేత లింగం గౌడ్ పిలుపు

రవీంద్రభారతి, నవంబర్ 5: ఎంతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థాయి హోదా సాధించి, అమితమైన పరిజ్ఞానం కలిగి ఉన్న అమోయ్ కుమార్‌పై వివక్ష ఎందుకు? ఆయన వెనుకబడిన కులంలో పుట్టడమే పాపమా? బీసీ బిడ్డ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్ ఒక్కడే అవినీతికి సహకరించిన అధికారి అయితడా? గత ప్రభుత్వ పాలనలో కలెక్టర్‌గా తనదైన శైలిలో ప్రజలకు సేవలందించి, అందరి మన్నలు పొందిన ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు లక్ష్యంగా చేసుకొని వివక్ష చూపుతోంది? అని బీసీ సంక్షేమ సంఘం నేత లింగం గౌడ్ అన్నారు. బీసీ నేత లింగం గౌడ్ పత్రికా ప్రటన విడుదల చేస్తూ ఐఏఎస్ అధికారిగా మంచి పేరు తెచ్చుకున్న అమోయ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకొని అవినీతి అంటగట్టి ఆయనను బలి పశువును చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీసీ కులంలో పుట్టడమే అమోయ్ కుమార్‌కు శాపంగా మారిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా భూములకు అధికారికంగా క్లియరెన్స్ ఇచ్చి ఉంటే ఇప్పటి ప్రభుత్వం రద్దు చేసే అవకాశం ఉంది. కానీ, ఒక బీసీ కులానికి చెందిన ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను ఒంటరిని చేసి కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లుగా బద్నాం చేసి అతని సిన్సియార్టీని దెబ్బతీసే విధంగా ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఆయన విమర్శించారు. బీసీ ఐఏఎస్ అధికారిని అవినీతి పరుడని ముద్రవేసి దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తే బీసీలు సహించరని, అమోయ్ కుమార్‌కు బీసీలంతా అండగా ఉంటామని, ఆయనపై మోపిన అవినీతి ముద్రను నిలిపి వేసేదాక బీసీలు ఆందోళన చేపడుతామని కాంగ్రెస్ ప్రభుత్వానికి హెచ్చరించారు.

నగరంలో పేరు మోసిన రౌడీ షీటర్ తన్ను ఖాన్‌ను బైక్ మీద ఎక్కించుకొని రాహుల్ గాంధీ ర్యాలీకి వెళ్తున్న కాంగ్రెస్ నేత బల్మూరి వెంకట్

రాహుల్ గాంధీ కోసం ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిరుద్యోగులు నిరీక్షించారు. దాదాపు రెండు గంటల పాటు బవార్చి రెస్టారెంట్ వద్ద వేచి ఉన్నారు. అయినా ఆయన రాకపోవడంతో తీవ్ర నిరాశతో నిరుద్యోగులు వెనుదిరిగి పోయారు.

కబ్జాకు గురైన స్థలాలపై హైడ్రా సర్వే

- అమీన్‌పూర్‌లో పార్కులు, రహదారుల కబ్జాపై ఫోకస్
- ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై వివరాల సేకరణ

అమీన్‌పూర్‌లో ఆక్రమణలపై సర్వే నిర్వహిస్తున్న జేడీ, సర్వే కార్యాలయ సిబ్బంది

సిటీబ్యూరో, నవంబర్ 5(నమస్తే తెలంగాణ): అమీన్‌పూర్‌లో పార్కులు, రహదారులు కబ్జాకు గురైనట్లు ఫిర్యాదులు రావడంతో మంగళవారం హైడ్రా బృందం ఆ ప్రాంతంలో సర్వే నిర్వహించింది. అమీన్‌పూర్‌లో ఎకరాకు పైగా ఉన్న పార్కు స్థలంతో పాటు రహదారులను గోల్డెన్ కీ వెంచర్ వాళ్లు కబ్జా చేశారంటూ వెంకటరమణ కాలనీ వాసులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలం విషయంలో ఇరు పక్షాల వారు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు హైడ్రా సర్వే జరిపించింది. మొత్తం ఐదు సర్వే నంబర్లలోని 150 ఎకరాలకు పైగా ఉన్న స్థలాన్ని జేడీ, సర్వే కార్యాలయ సిబ్బంది సర్వే చేశారు. వెంకటరమణ కాలనీ, చక్రపురి కాలనీ వాసులు, గోల్డెన్ కీ వెంచర్ నిర్వాహకులతో పాటు పరిసర కాలనీ వాసులు, గ్రామస్థుల సమక్షంలో ఈ సర్వే నిర్వహించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా బృందం స్థానికులతో అభిప్రాయసేకరణ జరిపింది. ఇందులో ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయి? ఏయే ప్రాంతాల్లో కబ్జాలతో స్థానికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న అంశాలపై కాలనీ వాసుల నుంచి అభిప్రాయాలు తీసుకున్నారు. మరో వైపు సర్వే నంబర్లు తారుమారుతో చేసిన వెంచర్లపై కూడా హైడ్రా దృష్టి పెట్టింది. సర్వే నంబర్ - ఆరుకు సంబంధించిన అనుమతులతో సర్వే నంబర్ - 12లోని ప్రభుత్వ భూమిని తమకు అమ్మారంటూ వచ్చిన ఫిర్యాదుపై కూడా హైడ్రా సర్వే అధికారులతో చర్చించి ఆ రెండు స్థలాలకు సంబంధించిన రిపోర్ట్‌ను కోరింది. లే అవుట్లను పరిశీలించి సర్వే నంబర్లు, హద్దురాళ్ల ఆధారంగా భూముల సరిహద్దులు నిర్ణయించి పార్కు స్థలాలతో పాటు రహదారుల ఆక్రమణలపై నివేదిక రూపొందించి తదుపరి చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు చెప్పారు. ఈ సర్వేలో హైడ్రా బృందంతో పాటు హెచ్ఎండీఏ, మున్సిపాలిటీ, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.